# గమనిక

"కారు మెల్లగా పోనీయ్" అంది సుమతి.

"ఎందుకు? ఏమైంది?" అని అడిగి, అద్దంలోంచి వెనక చూసుకుని కారు వేగం తగ్గించాను.

కుడిపక్కన ఉన్న హొటలు చూపిస్తూ, "దానిముందు మరీ ముందుకారు కొద్దిగా అటో ఇటో ఆపు" అంది.

"ఏమన్నా కావాలా?"

"ఏం వద్దు."

కారుసు హొటలుకు ముందుగా ఆపాసు.

రాత్రి తొమ్మిది దాటింది. ట్రాఫిక్ అంతగా లేదు. ఇంజన్ ఆపి, "ఎందుకాపమన్నావు?" అని అడిగి కారులో లైటువెలిగించబోయాను.

"లైటు వద్దు. ఆ కిటికీ వంక చూడు" అంది కుడిచేతి హోటల్‌వైపు చూపిస్తూ.

లైటు వెలిగించడం మాని హోటలు అద్దాల కిటికీ వైపు చూశాను. హోటలు అంత పెద్దదీ కాదు. చిన్నదీ కాదు. సికింద్రాబాద్ స్టేషన్‌కు దరిదాపుల్లో ఉండడం వలన రాత్రిళ్ళు పన్నెండింటి వరకూ రద్దీగానే ఉంటుంది. అక్కడి బిర్యానీకి మంచి పేరుంది. నేను చాలాసార్లు తిన్నాను. రుచిగా ఉంటుంది.

సుమతికి రుచిగా వంటలు చేయడం చేతకాదు. ఏ కూర వండినా ఏదో లోపం కనిపిస్తుంటుంది. మధ్యాహ్నం అయితే నేను ఆఫీసు క్యాంటీన్‌లోనే భోజనం చేస్తుంటాను. ఆమెకు సహాయం చేసే నెపంతో సాయంత్రాలు వీలైనంతవరకూ వంట నేనే చేస్తుంటాను. బంధువులు కాని, స్నేహితులు కాని వచ్చినప్పుడు మా ఇంటికి దగ్గరున్న హోటల్‌కు ఏం కావాలో ఫోన్ చేసి తెప్పించుకుంటాం.

మా నాన్న కూడా వంటలు చేస్తుంటాడు కాని, మా వంటగదిలోకి పొరపాటునైనా అడుగుపెట్టడు. మూడు నెలలకు ఒకసారో, నాలుగు నెలలకొకసారో వచ్చి ఒకటి రెండు రోజుల కన్నా మా దగ్గర ఎక్కువ ఉండడు. మా దురదృష్టం ఏమిటో గాని ఏ వంటమనిషీ మా ఇంట్లో (సుమతి బాధలు పడలేక) రెండు, మూడు నెలలకన్నా ఎక్కువ పనిచేయదు. మా పనిమనిషి మటుకు ఆస్థాన విద్వాంసురాలిలా చాలాకాలం నుండి అంటిపెట్టుకునే ఉంది.

నా స్నేహితుడిని, అతని భార్యాపిల్లలను సికింద్రాబాద్ స్టేషన్లో వదిలి తిరిగి మా ఇంటికి వెళ్తున్నాం. ఈవేళ మా అబ్బాయి పన్నెండో పుట్టినరోజు. వాడి ప్రతి పుట్టినరోజుకు నాన్న మా ఇంటికి తప్పక వస్తుంటాడు. ఫంక్షన్ బాగా జరిగింది. నేను, సుమతి ఆఫీసుకు వెళ్ళలేదు. వాడు నలభైమంది పైచిలుకు స్నేహితులను పిలిచాడు. నా తరఫున మూడు కుటుంబాలు, సుమతి తరఫున పది కుటుంబాల వరకు వచ్చారు. శీతాకాలం అవటాన త్వరగానే మొదలెట్టి ఎనిమిదింటి లోపల కార్యక్రమం ముగించి, నా స్నేహితుడిని వదిలిపెట్టేందుకు స్టేషన్‌కు వచ్చాం. అయిదు నిమిషాలు ఆలస్యం అయి ఉంటే బండి వెళ్ళిపోయి ఉండేది.

కిటికీ అద్దాలు దించి సుమతి చూపించిన వైపు చూశాను. నా కళ్ళను నేనే

నమ్మలేకపోయాను. అద్దాల కిటికీ పక్కన ఉన్న బల్లకు ఎదురుగా ఉన్న కుర్చీలో నాన్న కూర్చుని చపాతీలు తింటున్నాడు. ఒకపక్క బాధవేసింది. మరోపక్క సుమతి మీద కోపం వేసింది. వాళ్ళవాళ్ళు వచ్చినప్పుడు ఆతిథ్యం ఒకవిధంగా ఉంటుంది. మా తరపు వాళ్ళు వచ్చినప్పుడు మరోవిధంగా ఉంటుంది. ఇదే విషయాన్ని అయిదారుసార్లు ఎత్తిచూపి నేనే విసుగెత్తిపోయాను. తను నా మాటలు పట్టించుకోదు.

విసుగు నిగ్రహించుకుంటూ, "నాన్నకు భోజనం పెట్టలేదా?" అనడిగాను.

సుమతి వెంటనే సమాధానం చెప్పలేదు. నేనడిగింది తనను కాదన్నట్లు కిటికీలోంచి బయటకు చూస్తోంది.

"నిన్నే" అన్నాను.

"ఫంక్షన్ హడావిడిలో మర్చిపోయి ఉంటాను"- నా వైపు చూడకుండా నెమ్మదిగా అంది.

నాన్నకు షుగర్. సాయంత్రం ఆరు, ఆరున్నర మధ్యలో పుల్కాలు తినడం ముగించేస్తుంటాడు. ఆకలికి ఆగలేడు. మా ఊళ్ళో ఆయనకేం తక్కువ ఉండదు. మా వాళ్ళందరూ ఆయన్ని బాగానే చూసుకుంటారు. అక్కడే ఒక్కడే ఉంటాడు. బంధువర్గం ఉంది. ఎప్పుడో కాని ఊరొదిలి బయటకు రాడు. అమ్మ చనిపోయి పదహారు సంవత్సరాలైంది. నాన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి విశ్రాంత జీవితం గడుపుతున్నాడు. పింఛను బాగానే వస్తుంటుంది. అదీకాకుండా అయిదు ఎకరాల మాగాణి ఉంది. అది కౌలుకిచ్చాడు. దీనిమీద కూడా చెప్పుకోదగిన మొత్తమే వస్తుంటుంది. డబ్బు ఏం చేస్తుంటాడో నాకు తెలియదు. నేను ఎప్పుడూ అడగలేదు. అడగమని సుమతి నామీద అయిదారుసార్లు ఒత్తిడి తెచ్చింది. అడుగుతానని అన్నాను కాని అడగాలనిపించక అడగలేదు.

సుమతి, నేను ఉద్యోగాలు చేసుకుంటున్నాం. సొంత ఇల్లు ఉంది. మంచి జీతాలు వస్తున్నాయి. దేనికీ కొతర లేదు. ఆయన మా గురించి అడగనప్పుడు మేం ఆయన గురించి అడగటం ఏం బావుంటుంది? నాన్నకు నేనొక్కడినే కొడుకుని. మా ఊళ్ళో మా పొలాలు ఎక్కడ ఉన్నాయో నాకు తెలియదు. తెలుసుకోవా లనిపించలేదు. ఎన్నోసార్లు సుమతితో కలిసి మా ఊరు వెళ్దామనుకున్నాను. ఆ అనుకోవడం అనుకోవడంగానే మిగిలిపోయింది.

"ఆయన భోజనం చేశాక ఇంటికి మన కార్లో తీసుకువెళ్దామా?" అడిగాను.

"వద్దు. మనం ఆయన్ని చూసినట్లు తెలిస్తే బావుండదు."

కారు స్టార్ట్ చేయబోయేటంతలో, "కొద్దిసేపు ఆగుదాం" అంది సుమతి.

"మన కారు గుర్తుపడతాడేమో?"

"పట్టకపోవచ్చు."

మా కారు ఆగినచోట వీధి దీపం వెలగడం లేదు. వెన్నెల రోజులు కావు. మేం ఆయనను గమనిస్తున్న విషయం తెలియకపోవడమే మంచిది.

ఆయన ఎక్కువ సమయం తీసుకోలేదు. అయిదు నిమిషాల్లో చపాతీలు తినడం ముగించాడు. వెంటనే బయటకు వచ్చాడు. ఆయన చేతుల్లో రెండు గుడ్డ సంచులు, పెద్దవే, నిండుగా ఉన్నాయి. వాటిలో ఏమున్నాయో, ఏమో? ఎవరికవి?

ఆయన మా కారు దాటి ముందుకు వెళ్ళి, అటుగా వెళ్తున్న ఆటోరిక్షాను ఆపాడు. ఎక్కి కూర్చున్నాడు. రిక్షా కదిలి వెనక్కి మళ్ళింది. మా ఇంటిదారి కాదు.

"ఎంతవరకు వెళ్తున్నాడో గమనిద్దాం. కారు స్టార్టు చేయండి" అంది సుమతి.

కారు రిక్షా వెనక నడపడం మొదలెట్టాను. గూఢాచారి పని మటుకు నాకు ఇష్టంగా అనిపించడం లేదు. వీధులు చల్లగా నిర్మానుష్యమవుతున్నాయి. రిక్షా బైబిల్ హౌస్ వైపు వెళ్తున్నదల్లా రైలు బ్రిడ్జికి కొద్దిగా ఇటుపక్కగా ఆగింది. అది హోటలు నుంచి అట్టే దూరంలోలేదు. ఆయన రిక్షా దిగి డబ్బులిచ్చి సంచులు అందుకున్నాడు.

ఆయన రిక్షా దిగిన చోటుకు కొద్ది దూరంలో కారాపాను. ఆయన పక్కన కొద్ది ఎత్తులో, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (జిహెచ్ఎంసి) వీధి బాలుర వసతి గృహం ఉంది. రోజూ మా ఆఫీసుకు ఆ దారివెంట వెళ్తుంటాను. లోపలికి ఎప్పుడూ వెళ్ళలేదు.

అలవాటైన మెట్లనుకుంటాను. ఆయన చకచకా ఎక్కుతోంటే, నేను, సుమతి కారు దిగి గోడ పక్కగా ఆగాం. రెండు నిమిషాలు గడిచాక మెట్ల దగ్గరకు వచ్చాం. మెట్లమీద లైటు లేదు. వీధి దీపపు వెలుతురు మెట్ల వరకు రావడం లేదు. చీకటి చిక్కగా ఉంది. నాన్న అప్పటికే పైకంటా ఎక్కి తలుపు గట్టిగానే తట్టాడు. వెంటనే తెరుచుకుంది. ఆయన లోపలకు అడుగుపెట్టగానే "తాత వచ్చాడ్రోయ్" అంటూ

గదిలోని పిల్లల స్వరాలు పెద్దగా వినిపించడం మొదలెట్టాయి.

తలుపు దగ్గరకు వచ్చి నిలబడ్డాం. తలుపు దగ్గరకు వేసి ఉంది. ఆ సమయంలో మేం ఎవరి కంటపడినా మా శ్రమ వృథా అవుతుంది. తలుపు చిన్నగా నెట్టాను. సుమతి నా పక్కనే నిలబడి ఉంది. మెల్లగా, చప్పుడు కాకుండా తలుపు కొద్దిగా తెరుచుకుంది. లోపల వేలాడుతున్న రెండు దీపాల వెలుగులో గది పెద్దగా కనిపిస్తోంది. పిల్లలందరూ నాన్న చుట్టూ చేరారు. అందరూ కలిసి ఇరవై అయిదు మందికి పైగానే ఉంటారు. నాన్న ఒక సంచీలోంచి ఒక్కొక్కరికీ డ్రెస్సు, మరో సంచీలోంచి బిర్యానీ పొట్లాం తీసి చకచకా అందిస్తున్నాడు. అందరూ పద్నాలుగు సంవత్సరాల్లోపు కుర్రవాళ్ళే, అందుకున్నవాళ్ళు ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోడకు చేరగిలబడి ఆత్రంగా బిర్యానీ పొట్లాలు విప్పి తినటం మొదలెట్టారు. అప్పటివరకూ కోలాహలంగా ఉన్న గది నిశ్శబ్దమైంది.

తింటున్నవాళ్ళు నాన్నకు బాగా తెలిసున్న పిల్లల్లా ఉన్నారు. మురికిగా ఉన్నా దగ్గరగా వెళ్ళి వాళ్ళపక్కనే కూర్చుని తలలు ఆప్యాయంగా నిమురుతూ పరామర్శిస్తూ ఉన్నాడు. తను వాళ్ళలో ఒకడైపోయాడు. కొంతమంది పిల్లలు ఎంత ఆకలిగా ఉన్నారో ఏమో! పెదాలకు, బుగ్గలకు, ముక్కులకు మెతుకులు అంటుకుంటుంటే నాన్న తన చేతిరుమాలుతో శుభ్రం చేస్తుంటే ఆయన ముఖం సంతోషంతో వెలిగిపోతోంది.

"పిల్లలూ! చాలా తెచ్చానర్రా. ఇంకా కావలిస్తే అడగండ్రోయ్"

నాన్న వాళ్ళలో ఒకడైపోయాడు. ఈ మాటలకు నా మనసు దుఃఖపూరితమై కళ్ళలో నీళ్ళు తిరగటం మొదలెట్టాయి. అక్కడ నిలబడలేకపోయాను. పక్కకు తొలిగాను. సుమతి లోపలికి తొంగిచూస్తోంది.

సెల్‌ఫోన్ వెలుగులో గోడకు ఉన్న నల్లటి బోర్డు వంక చూశాను. నోటీసు బోర్డులా ఉంది. దానిమీద తెల్లటి సుద్దముక్కతో ఈ మాటలు రాసి ఉన్నాయి. గమనిక : "గత సంవత్సరం ప్రపంచంలో రోజుకు ముప్ఫై వేల బాలబాలికలు ఆకలితో చనిపోయారు. ఈ సంవత్సరం ఈ సంఖ్య నలభై వేలు ఉంటుందని ఒక అంచనా –జిహెచ్ఎంసి."

***సాక్షి 'ఫన్ డే', 1 జూలై, 2012***